ఈనాడు
నిజామాబాద్
ఆదివారం అక్టోబరు 20, 2024

ఏడాదిలోనే విశ్వాసం కోల్పోయిన ప్రభుత్వం

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంలోనే ప్రజల విశ్వాసం కోల్పోయిందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. జిల్లాకేంద్రంలో శనివారం సభ్యత్వ నమోదు కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం భాజపా జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కల్యాణలక్ష్మి చెక్కుతో పాటు తులం బంగారం, మూసీ పునరుజ్జీవం పేరిట పేదల ఇళ్ల కూల్చివేత, పింఛన్ల సంఖ్య పెంచకపోవడం, ఉన్నవారికే ఆలస్యంగా ఖాతాల్లో వేస్తుండటంతో ప్రజలు ఎదురుతిరగనున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓటేశామనే పరిస్థితి వచ్చిందని ఎద్దేవా చేశారు. నిరుద్యోగుల ఆందోళనకు భాజపా మద్దతు నిలుస్తుందని పేర్కొన్నారు. సభ్యత్వ నమోదుకు వెళ్తే సమస్యలపై వినతులు వెల్లువెత్తుతున్నాయన్నారు. రూ.2 వేల పింఛన్ రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు ఇస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారని, పరిస్థితి చూస్తే కొత్తవి దేవుడెరుగు ఉన్నవి తొలగించకుంటే చాలన్నారు. హామీలు పక్కనబెట్టారని విమర్శించారు. గ్రూప్-1 అభ్యర్థులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ మద్దతు తెలిపేందుకు వెళ్తే అడ్డుకోవడం హేయమన్నారు. జిల్లాలో 7 లక్షల ఓట్లు పడ్డాయని, అందులో సగమైనా సభ్యత్వాలు చేయించాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్, ఎమ్మెల్యే ధన్‌పాల్, పల్లె గంగారెడ్డి, పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, న్యాలం రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈటల రాజేందర్, వేదికపై జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్, పల్లె గంగారెడ్డి

భారాస నిరసన నేడు

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా ఎగవేతను నిరసిస్తూ కేటీఆర్ పిలుపు మేరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం భారాస నిరసన ప్రదర్శన చేపట్టనుంది. మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా ఆదేశాల మేరకు నగర కార్యకర్తలు ఉదయం 11 గంటలకు ఎన్టీఆర్ చౌరస్తాకు చేరుకోవాలని పార్టీ నేతలు పేర్కొన్నారు.

ఇన్‌ఛార్జి సీపీగా సింధుశర్మ



నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: నిజామాబాద్ పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ శింగెనవార్ బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో ఇన్‌ఛార్జి సీపీగా సింధుశర్మ నియమితులయ్యారు. జిల్లాకు పూర్తిస్థాయి పోలీసు కమిషనర్ వచ్చే వరకు ఆమె కొనసాగనున్నారు.

కల్మేశ్వర్‌కు వీడ్కోలు

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: బదిలీపై వెళ్తున్న నిజామాబాద్ పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ శింగెనవార్‌కు శనివారం పోలీసు అధికారులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఇందులో పోలీసు శాఖలో అదనపు డీసీపీ స్థాయి నుంచి సీఐలు, ఇతర శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. విధి నిర్వహణలో తనదైన ముద్ర వేసుకున్న సీపీ మరికొన్ని రోజులు జిల్లాలో ఉంటే బాగుండేదని అభిప్రాయం వ్యక్తం చేశారు.

సామాజిక బహిష్కరణపై విచారణ

నిజామాబాద్ న్యాయవిభాగం: తమను సామాజిక బహిష్కరణ చేశారని నందిపేట్ మండలం శాపూర్‌కు చెందిన బాధితులు ఇచ్చిన ఫిర్యాదును జిల్లా జడ్జి కుంచాల సునీత శనివారం పరిశీలించారు. నవంబరు 8న జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఇరువర్గాలతో సమావేశం నిర్వహించాలని సూచించారు. సామాజిక బహిష్కరణలు సరికాదని, స్థానికంగా ఏర్పాటు చేసిన కమ్యూనిటీ మీడియేటర్ల సహకారంతో సమస్యలు పరిష్కరించుకోవాలని, లేదంటే న్యాయసేవాధికార సంస్థ దృష్టికి తేవాలని చెప్పారు.



వేదికపై అభివాదం చేస్తున్న మాల మహానాడు నాయకులు

సింహగర్జన సభను జయప్రదం చేయండి

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నవంబరు 24న హైదరాబాద్‌లో చేపట్టనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఛైర్మన్ చెన్నయ్య పేర్కొన్నారు. మాలలకు వ్యతిరేకంగా జరుగుతున్న కుట్రలను అన్ని గ్రామాల్లో వివరించాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కష్టపడ్డ మాలలకు నామినేటెడ్ పదవుల్లో అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. కో-ఛైర్మన్లు రవి, రాంచందర్, వెంకటేశ్వర్లు, నాయకులు గైని గంగారాం, ఎడ్ల నాగరాజు, ఎల్లయ్య, మోహన్‌రావు, స్వామిదాస్, జైపాల్, వినయ్‌కుమార్, ఈశ్వర్, రమేశ్ పాల్గొన్నారు.

మళ్లీ.. మళ్లీ.. ఎత్తుకెళ్లి

☛ 9 నెలల్లో ఐదుగురు చిన్నారులు మాయం ☛ జీజీహెచ్‌లోనే రెండు ఘటనలు

జిల్లాలో చిన్నారుల తరచూ అపహరణ ఘటనలు తల్లిదండ్రులను కలవరపెడుతున్నాయి. గడిచిన తొమ్మిది నెలల్లో అయిదుగురు బాలలను ఎత్తుకెళ్లారు. శుక్రవారం అర్ధరాత్రి నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో నుంచి ఏడాది బాలుడి అపహరణ కలకలం రేపింది. మూడు నెలల కిందటే ఇదే ఆసుపత్రి ప్రాంగణంలోంచి మూడేళ్ల బాలుడ్ని ఇద్దరు యువకులు ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. అప్పట్లో సీసీ కెమెరాల దృశ్యాల ఆధారంగా నిందితులను పట్టుకున్నారు. తాజాగా ఘటనలోనూ అదే తరహాలో దర్యాప్తు సాగుతోంది. రెండు బృందాలు ఇప్పటికే రంగంలోకి దిగాయి.

ఈనాడు, నిజామాబాద్

జులై, తాజా ఘటన రెండూ ఆసుపత్రి ఆవరణలో జరగటం అటు ఆసుపత్రి వర్గాలు, ఇటు పోలీసులను కలవరపెడుతోంది. ఈ ప్రదేశాన్నే ఎంచుకొని ఎత్తుకెళ్లడం భద్రతా లోపాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. సాయంత్రం వేళ నుంచే రెక్కీలు నిర్వహించి.. చిన్నారులతో వచ్చిన తల్లిదండ్రులను గమనిస్తూ గడుపుతున్నారు. అర్ధరాత్రి దాటాక వారు గాఢ నిద్రలోకి జారుకున్నాక సినీ ఫక్కీలో తమ పని కానిచ్చేస్తున్నారు. మూడు నెలల కిందటి ఘటనలో తల్లి ప్రసవం కోసం ఆసుపత్రిలో చేరగా.. తండ్రితో పాటు ఆవరణలో నిద్రిస్తుండగా అపహరణకు గురయ్యాడు. ఈసారి బాధితులు మద్నూర్‌కు చెందిన రాజు-లక్ష్మి దంపతులు మూడేళ్ల కుమార్తె, ఏడాది కుమారుడితో శుక్రవారం సాయంత్రం ఇక్కడికి వచ్చారు. అనారోగ్య సమస్య ఉన్న లక్ష్మికి పరీక్షలు చేయించాలని భావించారు. ఆ సమయంలో ఓపీ లేకపోవడంతో ఆవరణలోనే నిద్రించి శనివారం ఉదయం వైద్యుడికి చూయించుకోవాలని భావించారు. కానీ తమ ఏడాది కొడుకు మణికంఠను ఎత్తుకెళ్తారని వారు గుర్తించలేకపోయారు. తెల్లారేసరికి పక్కలోని కుమారుడు కనిపించకపోవటంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు.

చేతిలో బాలుడు?

అపహరణ ఘటనలు ఛేదించటంలో పోలీసులు సాంకేతికతపై ఆధారపడి సఫలమయ్యారు. ఈసారి కూడా గతంలో మాదిరిగానే సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాలను పరిశీలించారు. ఓ మహిళ మరో ఇద్దరు యువతులతో కలిసి ఆవరణలో తిరుగుతున్న దృశ్యం అనుమానాస్పదంగా కనిపించింది. అర్ధరాత్రి వీరు ఆసుపత్రి బయటి గేటు వద్ద నుంచి వస్తున్న సందర్భంలో ఒకరు చంటి పిల్లాడిని ఎత్తుకున్నట్లు సీసీ కెమెరాలో నిక్షిప్తమైంది. ఈ ముగ్గురు ఆసుపత్రి ఆవరణలో తిగినప్పుడు వీరి చేతిలో బాలుడు లేడు. తిరిగి వెళ్తుండగా ఉండటంతో పోలీసుల అనుమానం బలపడింది. అయితే వీరి ముఖాలు గుర్తించేలా లేవు. ఆసుపత్రి చుట్టు పక్కల వెళ్లిన వాహనాల గురించి ఆరా తీస్తున్నారు. బస్టాండు, ప్రధాన రహదారిలోని సీసీ కెమెరాలనూ పరిశీలించారు.



మహారాష్ట్ర వైపు నుంచే..

బాలుడ్ని అపహరించిన వారు మహారాష్ట్ర నుంచి వచ్చినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. సీసీ కెమెరాల్లోని దృశ్యాల ఆధారంగా కొంత సమాచారం లభించినట్లు తెలుస్తోంది. వారు ఎటువైపుగా వచ్చారు..వెళ్లే సమయంలో ఎటు వెళ్లారో పరిశీలించారు. శనివారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం కూడా సీసీ ఫుటేజ్‌ల పరిశీలనకు అసౌకర్యం కలిగించింది. రెండు బృందాలు నిందితులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యాయని, ఆదివారం నాటికి కేసులో పురోగతి ఉంటుందని ఓ పోలీసు అధికారి వెల్లడించారు.



మచ్చుకు కొన్ని..

- నిజామాబాద్ నగరం మాలపల్లికి చెందిన ఏడేళ్ల మహ్మద్ మిన్హాజ్ జనవరి 30న అపహరణకు గురయ్యాడు. ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా ఎత్తుకెళ్లి హైదరాబాద్‌లో ఓ ముఠాకు రూ.3 లక్షలకు విక్రయించారు. పోలీసులు నాలుగు బృందాలుగా దర్యాప్తు సాగించి కేసును ఛేదించారు.
- ఫిబ్రవరి 6న ఆర్మూర్ బస్టాండులో ఓ మహిళ మెండోరాకు చెందిన ఏడేళ్ల బాలుడిని కిడ్నాప్ చేసి మెట్‌పల్లి వెళ్లే బస్సు ఎక్కింది. బాలుడి ఏడుపులు గమనించి ప్రయాణికులు ప్రశ్నించడంతో తడబడింది. దీంతో కమ్మర్‌పల్లి ఠాణాలో అప్పగించారు.
- ఫిబ్రవరి 4న నిజామాబాద్ నగర శివారులో ఓ మహిళ తన రెండేళ్ల కుమారుడితో కల్లు దుకాణానికి వెళ్లింది. అక్కడ ఓ జంట పరిచయమై కలిసి కల్లు తాగింది. ఆమె మత్తులోకి జారుకున్నాక వారు బాలుడిని ఎత్తుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ఆరంభించిన పోలీసులు మరుసటి రోజు మోర్తాడ్ మండలం పాలెం చౌరస్తాలో బాలుడిని గుర్తించారు.

వరద గేట్ల మూసివేత

శ్రీరామసాగర్ : శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి వరద చేరిక 14,454 క్యూసెక్కులకు తగ్గింది. ప్రాజెక్టు నుంచి మిగులు జలాల విడుదలకు తెరిచి ఉంచిన రెండు వరద గేట్లను శనివారం మూసివేసినట్లు ప్రాజెక్టు ఏఈ కొత్త రవి తెలిపారు. ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో 1091 అడుగుల వరకు నీటినిల్వ ఉంది. కాకతీయ కాల్వ ద్వారా 5800, ఎస్కేప్ గేట్ల ద్వారా 2200, వరద కాల్వకు 5000, లక్ష్మికి 150, సరస్వతికి 500, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు వదులుతున్నట్లు చెప్పారు.

విద్యార్థుల్ని సన్నద్ధం చేయాలి

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: త్వరలో సమ్మెటివ్ అసెస్మెంట్(ఎస్ఏ-1) పరీక్షలు ప్రారంభం కానున్నాయని, అందుకు తగినట్లుగా విద్యార్థుల్ని సన్నద్ధం చేయాలని డీఈవో దుర్గాప్రసాద్ ఉపాధ్యాయులకు సూచించారు. నగరంలోని ముబారక్‌నగర్ జడ్పీహెచ్ఎస్‌లో శనివారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు విద్యార్థి పాఠశాలకు గైర్హాజరు కాకుండా చూడటంతో పాటు అపార్ కార్డు నమోదుకు సంబంధించిన సమ్మతి పత్రాన్ని అందజేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు హన్మంతరావు ఉన్నారు.

శిరస్త్రాణం మరిచారు

న్యూస్‌టుడే, నిజామాబాద్ నేరవిభాగం

- నిత్యం రెండు ప్రమాదాలు.. ఒకరి మృతి
- ద్విచక్ర వాహన ఘటనలే అధికం
- 55 శాతం మంది యువతే

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. పోలీసు శాఖ అరికట్టేందుకు కృషి చేస్తున్నా అడ్డుకట్ట పడటం లేదు. వాహనదారులు నిబంధనలు పాటించకపోవడంతో తమ జీవితాలతో పాటు కుటుంబాలను అంధకారంలోకి నెడుతున్నారు. ముఖ్యంగా యువత వేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. శిరస్త్రాణాలు ధరించకపోవడం వల్ల ఎక్కువ మంది చనిపోతున్నారు. గతేడాది 745 ప్రమాదాలు చోటుచేసుకోగా 309 మంది మృతి చెంది, 749 మంది గాయపడ్డారు. ఇందులో ద్విచక్రవాహన ఘటనలే 229. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 625 ప్రమాదాల్లో 225 మంది మృతి చెందగా 582 మంది గాయపడ్డారు. ఈ ఏడాది ఇప్పటికే 180 ద్విచక్ర వాహన ప్రమాదాలు జరిగాయి. నియంత్రణ లేని వేగం, శిరస్త్రాణం ధరించకపోవడం వల్లే ప్రమాద తీవ్రత పెరుగుతోంది.



మచ్చుకు కొన్ని..

- మాక్లూర్ మండలం రాంచంద్రపల్లి వద్ద 17వ తేదీ రాత్రి తునికల కొలతల శాఖ ఉద్యోగి సుమన్(35) ద్విచక్ర వాహనంపై వస్తుండగా కారు వెనకాల నుంచి వచ్చి ఢీకొట్టడంతో మృతిచెందారు. తన తప్పులేకున్నా వెనకాల వ్యక్తి వేగం నియంత్రించుకోలేక ప్రమాదానికి కారకుడయ్యాడు.
- ఈ నెల 11న దాస్‌నగర్‌లో ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో నందిపేట్‌కు చెందిన ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరూ శిరస్త్రాణం ధరించలేదు. సమయానికి ఆసుపత్రిలో చేర్చడంతో ప్రాణాపాయం తప్పింది.
- ఇటీవల ఓ కానిస్టేబుల్ విధులు ముగించుకొని ఇంటికి వస్తుండగా ఆర్టీ రాణా పరిధిలో ప్రమాదం జరిగి మృతి చెందారు. శిరస్త్రాణం ఉంటే బతికేవాడు.

సంవత్సరం	ఘటనలు	మృతులు	క్షతగాత్రులు	ద్విచక్ర వాహన ప్రమాదాలు
2022	674	340	657	220
2023	766	337	768	229
24(అక్టోబరు8)	625	225	582	180

అవగాహన కల్పిస్తున్నా..

ప్రమాదాలను అదుపు చేసేందుకు బదిలీపై వెళ్తున్న సీపీ కల్మేశ్వర్ శింగెనవార్ గట్టిగా కృషి చేశారు. నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేయించారు. రవాణా శాఖతో సమన్వయం చేసుకొని జరిమానాలు విధించారు. ఆయా ఠాణాల పరిధిలో శిరస్త్రాణం ఆవశ్యకతపై సదస్సులు సైతం నిర్వహించారు.



హోటల్‌లో రంగులు కలిపిన మాంసం, బూజు పట్టిన మసాలాలు స్వాధీనం చేసుకుంటున్న ఫుడ్‌సేఫ్టీ అధికారులు

ఆహారకల్తీ నియంత్రణాధికారుల దాడి

- నగర హోటళ్లలో బూజు పట్టిన పదార్థాల స్వాధీనం
- వందల కిలోల మాంసం చెత్తకుండీలో పారబోత

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ప్రముఖ హోటళ్లు, మిర్చి, పసుపు తయారీ కేంద్రాలు, రెస్టారెంట్లు, మిఠాయి దుకాణాల్లో ఆహార కల్తీ నియంత్రణ అధికారులు శనివారం దాడులు చేశారు. హైదరాబాద్ నుంచి వచ్చిన టాస్క్‌ఫోర్స్ బృందాలు, అసిస్టెంటు ఫుడ్ కంట్రోలర్ అధికారి జ్యోతిర్మయి ఆధ్వర్యంలో దాడులు కొనసాగాయి. లహరి హోటల్, రెస్టారెంటులో తనిఖీ చేసి ఫ్రిజ్‌లో దాచిన 122 కిలోల కుళ్లిన మాంస ఉత్పత్తులను చెత్తబండిలో పారేయించారు. ప్రమాదకర రంగులు కలిపిన చికెన్, బూజు పట్టిన మసాలాలు, కూరగాయలు గుర్తించి నమూనాలు సేకరించారు. హోటల్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేసి నోటీసులు జారీ చేశారు. వంశీ ఇంటర్నేషనల్ హోటల్‌లో ఫ్రిజ్‌లో దాచిన హానికర రంగులు కలిపిన మాంసం, ఉడకబెట్టిన మిర్చి పేస్టు, కాలం చెల్లిన మసాలా పొడులు ధ్వంసం చేశారు. యజమానులకు ఎఫ్ఎస్ఎస్ఏకి సంబంధించిన నోటీసులు జారీ చేశారు. మిర్చికాంపౌండ్ ప్రాంతంలో మసాలా, కారం, పసుపు తయారీ కేంద్రాల్లో దాడుల చేసి నమూనాలు సేకరించి నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. దిల్లీవాలా మిఠాయి దుకాణంలో అపరిశుభ్రత చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్తీ అనుమానంతో పదార్థాలు సేకరించి పరీక్షలకు పంపారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, అవసరమైతే సంబంధిత శాఖ సాయంతో సీజ్ చేస్తామని హెచ్చరించారు. దాడుల్లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు రోహిత్‌రెడ్డి, స్వాతి, శీర్షిక, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బాలసాహిత్య వేదిక సమావేశం

నిజామాబాద్ సాంస్కృతికం: ఇందూరు జిల్లా బాల సాహిత్య వేదిక కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నగరంలోని సీతారాం నగర్‌కాలనీ సంస్థ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు కాసర్ల నరేశ్‌రావు ప్రకటనలో తెలిపారు. భవిష్యత్తులో చేపట్టబోయే కార్యాచరణపై చర్చ ఉంటుందన్నారు.

➺ యోగాలో అనితరసాధ్యులు
➺ విద్యార్థి సర్వ సమాచారనిధి.. అపార్ ➺ గర్భిణులకు అండగా

...వివరాలు... 14లో

మాక్లూర్ కస్తూర్బాలో వింతలు

- పోగొట్టుకున్న గొలుసు కోసం విద్యార్థినిని మంత్రగాడి వద్దకు తీసుకెళ్లిన సిబ్బంది

మాక్లూర్, న్యూస్‌టుడే: శాస్త్రీయత బోధించాల్సిన ఉపాధ్యాయురాలు మూఢత్వం బాట పట్టారు. పోయిన తన గొలుసు కోసం ఆరో తరగతి విద్యార్థిని మంత్రగాడి వద్దకు తీసుకెళ్లారు. ఇప్పుడీ ఘటన జిల్లా అంతటా చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. కొన్నాళ్లుగా వివాదాలకు కేంద్ర బిందువుగా మారిన మాక్లూర్ కస్తూర్బాలో మూఢనమ్మకాలు పెరిగాయి. కేజీబీవీలో ఉపాధ్యాయురాలి బంగారు గొలుసు గురువారం రాత్రి మాయమైంది. విద్యార్థినులే దొంగిలించారని కొంతమంది సిబ్బంది అనుమానించారు. ఓ విద్యార్థినిని మంత్రగాడి వద్దకు తీసుకెళ్తే నిజం బయటపడుతుందని సిబ్బంది భావించారు. ఆరో తరగతి చదువుతున్న బాలికను జిల్లాకేంద్రం మాలపల్లిలో నివాసముండే మాంత్రికుడి వద్దకు శుక్రవారం తీసుకెళ్లారు. నిమ్మకాయలు ముందుంచి, విద్యార్థిని చేతి వేలుకు నల్లటి రంగువేసి మంత్రాలు వేశారు. చివరకు చెత్తబుట్టలో బంగారు చైన్ ఉందని, వెళ్లి వెతుక్కోండని పంపించాడు. తీవ్ర భయాందోళనకు గురైన బాలిక ఒంటరిగానే పాఠశాలకు వచ్చింది. ఈ ఘటనపై శిక్షణ కలెక్టర్ సంకేత్‌కుమార్ శనివారం విచారణ చేపట్టారు. సిబ్బందిని ఒక్కొక్కరిని పిలిచి మాట్లాడారు. విద్యార్థినితో మాట్లాడగా తనను మంత్రగాడి వద్దకు తీసుకెళ్లిన విషయం భయంతో వెల్లడించింది.

వర్గాలుగా విడిపోయి..

రెండు నెలల కిందట ప్రత్యేక అధికారిణిగా అనురాధ బాధ్యతలు చేపట్టిన తర్వాత కస్తూర్బాలో సిబ్బంది రెండుగా చీలిపోయారు. పరస్పరం దూషించుకుంటూ ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసుకున్నారు. విద్యార్థిని మంత్రగాడి వద్దకు తీసుకెళ్లిన వ్యవహారాన్ని ఓ వర్గం అనుకూలంగా మార్చుకొని చిన్నారితో చెప్పించి వీడియో తీశారు. అది అధికారులకు చేరవేశారు.



విచారణ జరుపుతున్న శిక్షణ కలెక్టర్ సంకేత్ కుమార్

విద్యార్థి సర్వ సమాచారనిధి.. అపార్

● మొదట 9-12 తరగతులకు ప్రాధాన్యం

న్యూస్‌టుడే, నిజామాబాద్ విద్యావిభాగం

వ్యక్తికి ఆధార్‌కార్డు ఎలాగో విద్యార్థి సమగ్ర సమాచారం కోసం ఇకపై అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్ట్రీ) ఉపయోగపడనుంది. జాతీయస్థాయిలో ప్రతి విద్యార్థికి ఒక్కో నంబరు కేటాయించి తదనుగుణంగా వారి సమగ్ర సమాచారం నిక్షిప్తం చేస్తారు. 'వన్ నేషన్- వన్ స్టూడెంట్' నినాదంలో భాగంగా కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ కొత్త అధ్యయనానికి శ్రీకారం చుట్టింది. జాతీయ నూతన విద్యావిధానం-2020 అమల్లో భాగంగా దీన్ని చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు.

తల్లిదండ్రుల సమ్మతి

కేజీ నుంచి పీజీ వరకు ఈ విధానం అమలు చేయనున్నారు. జిల్లాలో తొలుత 9, 10, 11, 12 తరగతుల వారి వివరాలు సేకరించాలని నిర్ణయించారు. రానున్న రోజుల్లో కేజీ నుంచి అమలుచేస్తారు. ఇప్పటికే అన్ని పాఠశాలల యాజమాన్యాలకు అవగాహన కల్పించిన అధికారులు శనివారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో నమోదు చేసిన విద్యార్థుల వివరాలు వారి తల్లిదండ్రులకు పంపించి ధ్రువీకరించుకున్నారు. మార్పులుంటే(పుట్టినతేదీ కాకుండా) తల్లిదండ్రుల అంగీకారపత్రంతో ప్రధానోపాధ్యాయుడు మార్పు చేసే అవకాశం కల్పించారు. తర్వాత మార్పులకు అవకాశముండదని చెబుతున్నారు.

ఎలా పొందాలంటే?

ఇప్పటికే విద్యార్థి వివరాలు యూడైస్ ప్లస్‌లో నమోదు చేసినందునా.. అందులోనే తల్లిదండ్రులు సూచించిన సవరణలు చేసి ఆన్‌లైన్‌లో 'అపార్'కార్డుకు దరఖాస్తు చేయాలి. ప్రధానోపాధ్యాయుడి ధ్రువీకరణ తప్పనిసరి. ఆధార్ అనుసంధానమైన చరవాణికి ఓటీపీ వస్తుంది. అనంతరం గుర్తింపు నంబరు జారీ అవుతుంది. ఆన్‌లైన్‌లో కార్డు వెలువడిన తర్వాత సవరణలకు అవకాశం ఉండదు.

ప్రత్యేకతలు

విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, ఫొటో, క్యూఆర్ కోడ్, 12 అంకెలతో కూడిన గుర్తింపు నంబరు డిజిటల్‌కార్డులో ఉంటాయి. అకాడమీ సమాచారం, విద్యార్థి విజయాలు ఎప్పటికప్పుడు నమోదవుతాయి. అకాడమీ పరంగా జీవితకాల గుర్తింపు కార్డుగా పరిగణిస్తారు. విద్యార్థి సంబంధిత సర్వ సమాచారం సమీకృతంగా ఒకేచోట లభిస్తుంది. ఆన్‌లైన్లో నంబరు నమోదు లేదా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసినా పూర్తి వివరాలు తెలుస్తాయి.



వెబ్‌సైట్ ముఖచిత్రం



నమూనా కార్డు

ప్రయోజనాలు

ఇది విద్యార్థికి గుర్తింపుకార్డుగా ఉపయోగపడుతుంది. విద్యార్థి బ్యాంకు ఖాతా(అకాడమీ), డీజీ లాకర్‌తో అనుసంధానమై ఉంటుంది. విద్యాసంస్థల ప్రవేశాలు, ప్రవేశ పరీక్షల్లో వివరాల నమోదు, ధ్రువీకరణ సులువవుతుంది. ఉపకార వేతనాలు, ఉద్యోగాల భర్తీ సమయం, ఇతర సందర్భాల్లో కీలకంగా మారనుంది.

భవిష్యత్తులో ఇదే కీలకం

- దుర్గాప్రసాద్, డీఈవో, నిజామాబాద్

అపార్‌కార్డు కీలకంగా మారనుంది. తల్లిదండ్రులు విద్యార్థి సమాచారం జాగ్రత్తగా పరిశీలించి, అనుమతి పత్రం సమర్పించాలి. తల్లిదండ్రులు చొరవ తీసుకొని పాఠశాల ప్రధానోపాధ్యాయులను సంప్రదించి, ప్రక్రియ పూర్తి చేసుకోవాలి. నాలుగు తరగతులకే పరిమితం కాకుండా.. దశలవారీగా మిగతా తరగతులకు అమలు చేస్తాం. ప్రవేశ సమయంలోనే వివరాలు సేకరించి, కార్డు ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం.

బయోమైనింగ్ ప్రక్రియ ప్రారంభం !



పురపాలకశాఖ ఆదేశాల మేరకు జిల్లాలో మొదటిసారిగా బాన్సువాడ బల్దియా పరిధిలో బయోమైనింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ ప్రక్రియలో భాగంగా మొదట డంపింగ్‌యార్డు లోని చెత్త నిల్వలు అంతా కలిపి ఒక దగ్గర వేస్తారు. అందులో ఓ రసాయనం చల్లుతారు. కొద్ది రోజుల తర్వాత ఆ చెత్తను వాహనాల్లో నింపి బరువు చూస్తారు. తర్వాత ఆ చెత్తను ప్రత్యేక మిషన్లలో వేసి చెత్త నుంచి తడి, పొడి, ప్లాస్టిక్, హానికరవ్యర్థాలు, బయో సాయిల్.. ఇలాంటివి వేరు చేస్తారు. ఇలా చేయడంతో దుర్గంధం నివారించడంతో పాటు కంపోస్టు ఎరువు తయారు చేయడం, ప్లాస్టిక్ వస్తువుల పునర్వినియోగంతో పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందించినట్లు అవుతుందని అధికారులు చెబుతున్నారు. అలాగే డంపింగ్ యార్డు స్థలం సైతం వినియోగానికి సిద్ధంగా ఉండేలా చేసినట్లు అవుతుంది. ఈ విషయంపై బాన్సువాడ బల్దియా కమిషనర్ శ్రీహరి రాజు మాట్లాడుతూ.. 'బయోమైనింగ్ ప్రక్రియ ఇటీవలే ప్రారంభమైంది. చెత్తనిల్వలు ఒక దగ్గర పోగుచేశారు. దాని నుంచి వివిధ రకాల వ్యర్థాలు వేరు చేసి పునర్వినియోగం, ఎరువుల తయారీకి ఉపయోగపడేలా చేస్తారు. వీటిని బల్దియా అవసరాలకు, హరితహారంలో మొక్కల పెంపకం వంటి వాటికి వినియోగించే అవకాశం ఉంటుంది. ఎక్కువ ఉత్పత్తి అయితే విక్రయించడంతో ఆదాయం సైతం సమకూరుతుంది. పురపాలికశాఖ ద్వారా ఓ సంస్థ ఆధ్వర్యంలో పనులు ప్రారంభమయ్యాయి' అని తెలిపారు.

- న్యూస్‌టుడే, బాన్సువాడ పట్టణం

గడువు పొడిగింపు

నిజామాబాద్ విద్యావిభాగం: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశానికి ఈ నెల 30వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు జిల్లా కన్వీనర్ యాదగిరి శనివారం ప్రకటనలో తెలిపారు. అన్ని ఐటీఐల్లో మిగిలిన ఖాళీలతో పాటు మరో మూడు ఐటీఐల్లో ప్రవేశ పెట్టిన నైపుణ్యాభివృద్ధి కోర్సుల్లో ప్రవేశానికి చక్కని అవకాశమన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు చరవాణి నెంబర్లు 99481 95654, 94410 74767లలో సంప్రదించాలని సూచించారు.

రక్తదానానికి తరలిరండి

కామారెడ్డి పట్టణం: జిల్లా కేంద్రంలో ఆదివారం తలపెట్టిన మెగా రక్తదాన శిబిరానికి తరలిరావాలని ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర ఛైర్మన్ బాలు, రక్తదాతల సమూహ అధ్యక్షుడు వేదప్రకాశ్ అన్నారు. కామారెడ్డిలోని ఆయా కళాశాలల్లో కార్యక్రమ ప్రతులను ఆవిష్కరించారు. రక్తదాతల సమూహం ఆధ్వర్యంలో తలసేమియా బాధితుల కోసం శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతినిధులు గంప ప్రసాద్, జమీల్, అనిల్‌కుమార్, దత్తాత్రి తదితరులున్నారు.

బీఫార్మసీ కౌన్సెలింగ్

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: బీఫార్మసీ/ఫార్మా డీ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించిన టీజీఎప్‌సెట్‌బీ-2024 మొదటిదశ కౌన్సెలింగ్ శనివారం నుంచి ప్రారంభమైందని జిల్లా సమన్వయకర్త, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ నరేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ తర్వాత 21-23 తేదీల్లో ఎంపిక చేసుకున్న సహాయ కేంద్రాల్లో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలన్నారు. 21-25 తేదీల్లో వెబ్ ఆప్షన్లు ఎంచుకోవాలన్నారు. 28వ తేదీలోపు సీట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు.

యోగాలో అనితరసాధ్యులు

న్యూస్‌టుడే, ఇందూర్ సిటీ

ఇందూరు చిన్నారులు శరీరంలో ఎముకలున్నాయా లేదా అన్నట్లుగా యోగాసనాలు వేస్తున్నారు.. వివిధ పోటీల్లో సత్తాచాటుతూ రాష్ట్ర, జాతీయస్థాయికి ఎంపికవుతున్నారు. ప్రముఖుల మన్ననలు పొందుతున్నారు. పలువురిని 'న్యూస్‌టుడే' పలకరించగా వారి మనోగతం వెల్లడించారు.

మూడు సార్లు జాతీయస్థాయిలో..


అసిత,

ఏడేళ్లుగా యోగా గురువు సంగీత వద్ద శిక్షణ తీసుకుంటున్నాను. ఇప్పుడు ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాను. ఇప్పటి వరకు మూడు సార్లు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నాను. యోగా శిక్షణలో మానసిక శారీరక మార్పును గుర్తించాను. నిరంతరం సాధన చేసి మంచి గుర్తింపు తెచ్చుకోవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాను. **- అసిత, నిజామాబాద్**

14 ఏళ్లుగా సాధన


- రిత్విక,

డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాను. 14 ఏళ్లుగా యోగాలో శిక్షణ తీసుకుంటున్నాను. నిరంతరం ఆసనాలు సాధన చేయడంతో పాటు చదువులోనూ రాణించడం సంతోషంగా ఉంది. ఇదివరకే మూడు సార్లు రాష్ట్రస్థాయిలో పాల్గొన్నాను. త్వరలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాను. రోజుకు గంటపాటు సాధన చేస్తే ఆరోగ్య సమస్యలు తలెత్తవు.

- రిత్విక, నిజామాబాద్

శారీరకంగా మానసికంగా ఎదుగుతారు



విద్యార్థి దశ నుంచే యోగా సాధనతో శారీరకంగా, మానసికంగా ఎదుగుతారు. కేంద్ర ప్రభుత్వం యోగా ప్రాముఖ్యం తెలిసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. ఆయుష్ విభాగంలో యోగా సాధనను ఓ భాగంగా చేసింది. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ సాధన చేయాలి.

- రాంచందర్, యోగా గురువు

నాన్నే నా శిక్షకుడు



మూడేళ్ల నుంచి యోగా సాధన చేస్తున్నాను. పదో తరగతి చదువుతున్నాను. శిక్షకులు మా నాన్న విజయ్‌కుమార్ కావడంతో సాధన మరింత సులువైంది. ఇప్పటి వరకు మూడు సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. అంతర్జాతీయ వేదికపై ఆసనాలు ప్రదర్శించాలని నాన్న కోరిక. ఆ దిశగా సాధన చేస్తున్నాను.

- లక్ష్మస్వీ, నిజామాబాద్

ఇద్దరం కలిసి..



మేమిద్దరం కవలలు కావడంతో అందరు మాలో ఎవరు తన్వీ, ఎవరు తన్యా గుర్తించేవారు కాదు. 9వ తరగతి చదువుతున్న మేము సంవత్సరం నుంచి శిక్షణ తీసుకుంటున్నాం. మా శిక్షకురాలు ఉమారాణి ఆసనాలపై పట్టు పెరిగేలా ప్రోత్సహిస్తున్నారు. రాష్ట్రస్థాయిలో రెండు సార్లు ప్రాతినిధ్యం వహించాం. నిత్యం రెండు గంటలు సాధన చేస్తాం.

- తన్వీ, తన్యా, నిజామాబాద్

దక్షిణభారత నాటిక పోటీలకు జిల్లా విద్యార్థులు

నిజామాబాద్ విద్యావిభాగం: జిల్లా కేంద్రం విజయ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన నాటకం ఎస్సీఈఆర్టీ ఆధ్వర్యంలో గురు, శుక్రవారాల్లో నిర్వహించిన డ్రామా ఫెస్టివల్‌లో ప్రథమ స్థానంలో నిలిచి దక్షిణ భారత నాటికపోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ ప్రభాదేవి శనివారం తెలిపారు. 'సేవ్ వాటర్.. హైడ్రా హోప్' అనే ఈ నాటికను రచించిన తొమ్మిదో తరగతి విద్యార్థి విజితేంద్రియ, సహాయ దర్శకత్వ బాధ్యతలు నిర్వర్తించిన శరణ్‌తేజతో పాటు ప్రదర్శనలో పాల్గొన్న తరుణ్, సిరివేద, తనుశ్రీ, రౌధాజహాన్, రవి త్రేయిని, రాజ్‌కరణ్‌రెడ్డి, శ్రీకర్, రోహన్‌రెడ్డిని పాఠశాల కార్యదర్శి అమృతలత అభినందించారు.



విద్యార్థులతో పాఠశాల కార్యదర్శి అమృతలత, యాజమాన్యం

గర్భిణులకు అండగా

✪ అందుబాటులో 102 అంబులెన్స్‌లు

న్యూస్‌టుడే, కామారెడ్డి వైద్యవిభాగం

గర్భిణులకు సకాలంలో వైద్య సేవలు అందేలా 108, 102 అంబులెన్స్ వాహనాలను సర్కారు అందుబాటులోకి తెచ్చింది. 108 అంబులెన్స్‌లు రోడ్డు ప్రమాదాలకు, అత్యవసర కేసులను ఆసుపత్రులకు తరలిస్తున్నారు. కొంతకాలంగా కామారెడ్డి జిల్లాలో గర్భిణులు వైద్య పరీక్షల కోసం గ్రామాల నుంచి జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రసవమయ్యేందుకు ఒక్క కేసుకు రూ.40 వేల నుంచి రూ.60 వేల వరకు ఖర్చవుతోంది. అత్యవసర సమయాల్లో ఈ వాహనాలను వినియోగించుకునేవారికి ఆర్థిక పరంగా ఎంతో వెసులుబాటు కానుంది. 102 వాహనాలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని జీజీహెచ్ పర్యవేక్షణాధికారిణి ఫరీదా పేర్కొన్నారు.


కామారెడ్డి జీజీహెచ్ వద్ద 102 వాహన సేవలు వినియోగించుకుంటున్న గర్భిణులు, బాలింతలు

కామారెడ్డి జీజీహెచ్‌లో ప్రసవాలు

	సాధారణ	శస్త్రచికిత్స
మే	123	210
జూన్	121	191
జులై	112	201
ఆగస్టు	118	262
సెప్టెంబర్	115	240

ఖైదీలకు అసౌకర్యం కలిగించొద్దు

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: ఖైదీలకు అసౌకర్యం కలిగించకుండా చూసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.నాగరాణి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఉప కారాగారాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలకు కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. అనంతరం కారాగారంలోని వంట గదిని పరిశీలించారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది మాయ సురేష్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది మోహన్‌రావు, ఉప కారాగారం సూపరింటెండెంట్ సంజీవరెడ్డి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ జూనియర్ అసిస్టెంట్‌లు ఖాన్, సాయిప్రణీత్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి

'ప్రజావ్యతిరేక ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు'

కామారెడ్డి పట్టణం: పేదల సమస్యలు పట్టని ఎన్డీయే ప్రభుత్వానికి ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు జ్యోతి అన్నారు. పట్టణంలో శనివారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. దేశంలో యువతకు ఉద్యోగాల కల్పన, మహిళల భద్రత విషయంలో కేంద్రం విఫలమైందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు రమ, జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్, మోతీరాం, రవీందర్, అరుణ్, యాదగిరిగౌడ్, అజయ్, ఖలీల్, నర్సింలున్నారు.


నినాదాలు చేస్తున్న నాయకులు

21న ఫుట్‌బాల్ పోటీలు

నిజామాబాద్ క్రీడావిభాగం,: నగరంలోని రాజారాం స్టేడియంలో ఈ నెల 21న ఉదయం 10 గంటలకు అండర్-19 విభాగంలో ఉమ్మడి జిల్లా బాలబాలికల ఫుట్‌బాల్ ఎంపికలు నిర్వహించనున్నామని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ చదివే విద్యార్థులు అర్హులని, క్రీడాకారులు సమయపాలన పాటించాలన్నారు. వివరాలకు పీడీ ప్రసాద్ 9441631631 నంబరులో సంప్రదించాలన్నారు.

జిల్లాస్థాయి వాలీబాల్ జట్ల ఎంపికలు పూర్తి

కామారెడ్డి క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి వాలీబాల్ జట్ల ఎంపికలు పూర్తయ్యాయి. కామారెడ్డిలోని సరస్వతి శిశుమందిర్‌లో శనివారం అండర్-17, 14 బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. అండర్-14 బాలుర విభాగంలో ప్రథమ బహుమతిని ఎల్లారెడ్డి జోన్, ద్వితీయ బహుమతిని తాడ్వాయి జట్లు గెలుచుకున్నాయి. అండర్-14 బాలికలు, అండర్-17 బాలుర, బాలికల విభాగాల్లో ఎల్లారెడ్డిజోన్ ప్రథమ, బాన్సువాడ జోన్ ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి హీరాలాల్, స్వామి గౌడ్, అశోక్, సురేష్, సాయిమౌర్య, అతిక్, భాస్కర్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.


అండర్-17కు ఎంపికైన బాలికల జట్టు

మహిళపై నలుగురి అత్యాచారం

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: నిజామాబాద్ జిల్లాలో ఓ మహిళపై నలుగురు అత్యాచారానికి ఒడిగట్టిన ఘటన కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. జిల్లా కేంద్రానికి మహిళ(36)ను శుక్రవారం రాత్రి బస్టాండు ప్రాంతం నుంచి ఇద్దరు వ్యక్తులు ఆటో ఎక్కించుకొని వెళ్లారు. డిచ్‌పల్లి ప్రాంతంలో నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి మరో ఇద్దరు కలిసి అత్యాచారం చేసి ఆమెను అక్కడే వదిలేసి పారిపోయారు. రాత్రి కావడంతో బాధితురాలు అక్కడి నుంచి ఇంటికి వచ్చారు. శనివారం ఉదయం ఒకటో ఠాణా పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి వెల్లడించారు. నిజామాబాద్ ఏసీపీ రాజావెంకటరెడ్డి కేసు విచారించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

నిజామాబాద్

• నిజామాబాద్ అర్బన్ • నిజామాబాద్ రూరల్ • బోధన్ • బాన్సువాడ

పల్లకీ సేవ



జక్రాన్‌పల్లి, న్యూస్‌టుడే: తొర్లికొండలోని శిలాద్రి వేంకటేశ్వర మందిరంలో శనివారం పల్లకీ సేవను అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు మంగళ హారతులతో పూజించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ సాయిరెడ్డి, కోశాధికారి చిన్న సాయన్న తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ పరామర్శ



ఇందల్‌వాయి : జిల్లా కేంద్రంలో శనివారం భాజపా కార్యకర్తల సమావేశానికి హాజరైన ఎంపీ ఈటల రాజేందర్ తిరిగి వెళ్లే సమయంలో ఇటీవల దుబాయిలో గుండెపోటుతో మృతిచెందిన చంద్రాయన్‌పల్లికి చెందిన బి.శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి తదితరులు ఉన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

94408 85670
80085 74007
98850 93048

సమస్య: పల్లెల్లో ఖాళీ స్థలాల్లో పొదలు ఏర్పడి విష సర్పాలు వస్తున్నాయి.

- మధు, గ్రామస్థుడు

పరిష్కారం: స్థలాల యజమానులకు నోటీసులు ఇస్తాం. పొదలు తొలగిస్తాం.

- ఉమా, కార్యదర్శి

సమస్య: న్యాల్‌కల్ రోడ్డులోని చంద్రనగర్‌లో మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదు. నెల రోజులుగా కాలువల్లో చెత్త పేరుకుపోయి దోమలు పెరుగుతున్నాయి.

- నాగరాజు, స్థానికుడు

పరిష్కారం: డివిజన్ పరిధిలో కాలనీల వారీగా మురుగు కాలువలు శుభ్రం చేస్తున్నాం. చంద్రనగర్‌లో సోమవారం కార్మికులను పంపించి మురుగు కాలువలు శుభ్రం చేయిస్తాం.

- మహిపాల్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు

సమస్య: యెండల టవర్స్ అపార్ట్‌మెంట్స్ ముందు ఆసుపత్రులు కొత్తగా నిర్మించడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రోడ్డు పైనే వాహనాలు నిలపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

- విజయ్, స్థానికుడు

పరిష్కారం: సెల్లార్లలో పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. టౌన్‌ప్లానింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేలా చూస్తాం.

- సునీల్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు.

– న్యూస్‌టుడే, నిజామాబాద్ నగరం, నిజామాబాద్ గ్రామీణం

ఉత్సాహంగా వ్యాసరచన పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న కరస్పాండెంట్ మురళీకృష్ణ, ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, ఉపాధ్యాయులు



బహుమతులతో మల్లారం జడ్పీ పాఠశాల విద్యార్థులు

నిజామాబాద్ సాంస్కృతికం, విద్యావిభాగం, న్యూస్‌టుడే: నగరంలోని న్యాల్కల్ రోడ్ నలంద ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలను నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం - లాభనష్టాలు - విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై విద్యార్థులు వ్యాసరచన చేశారు. దరణిదత్త ప్రథమ, కీర్తన ద్వితీయ, సూర్య తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల కరస్పాండెంట్ మురళీకృష్ణ, ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిజామాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామీణ మండలం మల్లారం జడ్పీ పాఠశాలలో శనివారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇంటర్నెట్ వినియోగంతో లాభనష్టాలు, సోషల్ మీడియా ప్రభావం అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. రవళి ప్రథమ స్థానం, అబ్దుల్ సనా ద్వితీయ, ఎస్.హర్షిత తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు హెచ్‌ఎం రామ్మోహన్ ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే: బోధన్ పట్టణంలోని వంశీ ఉన్నత పాఠశాలలో శనివారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. ఇంటర్నెట్ వినియోగంతో లాభ నష్టాలు, విద్యార్థులపై సోషల్‌మీడియా ప్రభావం అనే అంశాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో అమృత ప్రథమ, దృవిత ద్వితీయ, నాగరక్షిత తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల డైరెక్టర్ పద్మజ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు.



బహుమతులు, ప్రశంసాపత్రాలు చూపుతున్న వంశీ పాఠశాల విద్యార్థినులు

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

డిచ్‌పల్లి గ్రామీణం, ఇందల్‌వాయి, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రాలను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. డిచ్‌పల్లి మండలం బీబీపూర్, ఖిల్లా డిచ్‌పల్లి గ్రామాల్లో శనివారం ఐడీసీఎంఎస్ ఛైర్మన్ తారాచంద్‌నాయక్, సొసైటీ ఛైర్మన్ రాంచందర్‌గౌడ్‌లతో కలిసి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. గతంలో 450 కేంద్రాలు ఉంటే, ఈ సారి అదనంగా 100 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. నిజామాబాద్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇందల్‌వాయి సొసైటీ పరిధిలోని చంద్రాయన్‌పల్లిలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సొసైటీ ఛైర్మన్ గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డిచ్‌పల్లి గ్రామీణం : ధాన్యం తూకం వేసున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ఎమ్మెల్యే అభినందన

జక్రాన్‌పల్లి, న్యూస్‌టుడే: నూతనంగా ఏర్పాటు కాబోతున్న ఆర్మూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో జక్రాన్‌పల్లి మండలం గన్యాతండాకు చెందిన పీర్‌సింగ్‌కు డైరెక్టర్ పదవి ఇవ్వడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పీర్‌సింగ్‌ను అభినందించారు.

ఏటీసీ నిర్మాణాల్లో వేగం పెంచండి

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: నగరంలోని ప్రభుత్వ బాలుర, బాలికల ఐటీఐ ప్రాంగణాల్లో నూతనంగా నిర్మిస్తున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల (ఏటీసీ) నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని జిల్లా పాలనాధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశించారు. శనివారం క్షేత్రస్థాయిలో పనుల నాణ్యతను పరిశీలించిన ఆయన ఎప్పటి వరకు పూర్తి చేస్తారని అధికారులను ప్రశ్నించారు. నగరంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐ, బోధన్, కమ్మర్‌పల్లి ఏటీసీ నిర్మాణాల్లో వేగం పెంచాలన్నారు. వచ్చే వారంలో సంబంధిత శాఖల ముఖ్యకార్యదర్శులు పరిశీలనకు వచ్చే అవకాశముందని, నిరంతర పర్యవేక్షణ చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు.



పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

దారి దోపిడీలతో కలవరం

● ఒంటరి వ్యక్తులే లక్ష్యంగా చోరీలు ● నగదు అపహరించి దాడులు

న్యూస్‌టుడే, నవీపేట



నవీపేట ప్రధాన కూడలి వద్ద పని చేయని సీసీ కెమెరాలు

నవీపేట మండలంలో ఇటీవల చోటు చేసుకున్న దారి దోపిడీలు ప్రజలను కలవర పెడుతున్నాయి. ఒకే రోజు అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ఒకే ముఠాకు చెందిన ముగ్గురు యువకులు నలుగురిని దోచుకుని వారిపై దాడి చేసి ద్విచక్ర వాహనంపై పారిపోవడం చర్చనీయాంశంగా మారింది. శివారు ప్రాంతాలను అడ్డాగా చేసుకుని పక్కా ప్రణాళికతో దాడులు చేస్తూ దారి దోపిడీలకు పాల్పడుతున్నారు.

ఇటీవల జరిగిన ఘటనలు..

☛ రెంజల్ మండలం కల్యాపూర్‌కు చెందిన కాశం శ్రీనివాస్ ద్విచక్ర వాహనంపై ఈ నెల 17న అర్ధరాత్రి తర్వాత ఒంటరిగా నవీపేటకు బయల్దేరారు. గ్రామ శివారులోని ఓ ప్రైవేటు పాఠశాల వద్దకు రాగానే గుర్తు తెలియని ముగ్గురు యువకులు అతడి వాహనాన్ని అడ్డగించారు. శ్రీనివాస్‌పై దాడి చేసి గాయపర్చి అతని వద్ద ఉన్న రూ.4వేల నగదు, చరవాణి లాక్కున్నారు. నంబరు ప్లేటు లేని వాహనంపై ముగ్గురూ పారిపోయారు.

☛ శివతండాకు చెందిన నరేశ్‌కుమార్ ఈ నెల 18 తెల్లవారుజామున ద్విచక్ర వాహనంపై ఒంటరిగా నిర్మల్ జిల్లా బాసర వెళ్తున్నారు. మిట్టాపూర్ శివారులోకి రాగానే ద్విచక్ర వాహనాన్ని ముగ్గురు యువకులు అటకాయించి నరేశ్‌ను విచక్షణా రహితంగా కొట్టారు. అతని నుంచి రూ.2,500 నగదు, చరవాణి ఎత్తుకెళ్లారు.

☛ నాగేపూర్ వద్ద రోడ్డు మీదుగా ఉదయం వాకింగ్ చేస్తున్న ఇద్దరిపై ఈ నెల 18న దాడి చేసి వారి చరవాణులు అపహరించుకెళ్లారు.

సిబ్బంది కొరత

నవీపేట ఠాణా పరిధిలో 35 గ్రామాలున్నాయి. ఒక ఎస్సై, ముగ్గురు ఏఎస్సైలు ఉన్నారు. నలుగురు హెడ్‌కానిస్టేబుళ్లకు ఒకరే విధులు నిర్వహిస్తున్నారు. 21 మంది కానిస్టేబుళ్లకు 12మంది మాత్రమే ఉన్నారు. హోంగార్డులు ఏడుగురికి ఐదుగురున్నారు.

పనిచేయని సీసీకెమెరాలు..

దోపిడీలు అరికట్టేందుకు వాహనాల తనిఖీలు, పెట్రోలింగ్‌ను మరింత పక్కాగా చేయాలని ప్రజలు కోరుతున్నారు. మరోవైపు నవీపేటలోని బాసర రహదారిపై ప్రధాన కూడళ్ల వద్ద ఇది వరకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఒక్కటీ పని చేయడం లేదు. వీటిని వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

తనిఖీలు విస్తృతం చేస్తాం

యాదగిరిగౌడ్, ఏఎస్సై

వరుస దారి దోపిడీల నేపథ్యంలో వాహనాల తనిఖీలు మరింత పక్కాగా చేపడుతాం. అత్యవసర పనులు ఉంటేనే వాహనదారులు రాత్రిళ్లు బయటకు వెళ్లాలి. సీసీ కెమెరాలు వినియోగంలోకి తీసుకు వచ్చేందుకు వీడీసీలతో చర్చిస్తాం.

ట్రస్ట్ ఏర్పాటు అభినందనీయం

నిజామాబాద్ న్యాయవిభాగం న్యూస్‌టుడే: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో భవిష్యజ్యోతి ట్రస్ట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్ అన్నారు. శనివారం కాన్ఫరెన్స్ హాలులో జరిగిన సమావేశంలో జిల్లా జడ్జి కుంచాల సునీత మాట్లాడుతూ.. నగరంలోని బాలసదన్‌లో ఆశ్రమం పొందుతున్న అనాథ బాలికలకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని విధాలుగా తోడ్పాటు అందించేందుకు ఈ ట్రస్ట్ ఏర్పాటు చేశామన్నారు. 30 మంది అనాథ బాలికలకు స్వచ్ఛందంగా విద్య నందించేందుకు ముందుకు వచ్చిన కాకతీయ, రవి పబ్లిక్, నిర్మల హృదయ పాఠశాలల యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిచ్‌పల్లి ఏడో బెటాలియన్ కమాండెంట్ ప్రియదర్శిని, రెండవ అదనపు జిల్లా జడ్జి టి.శ్రీనివాస్, సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ బాబు, మేజిస్ట్రేట్ గోపికృష్ణ, హరికుమార్, పాఠశాలల యాజమాన్యాలు, విద్యార్థులు, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా జడ్జి కుంచాల సునీత, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్ దంపతులు

భగవంతుడి తత్వం గొప్పది



అభిషేకం చేస్తున్న గణపతి సచ్చిదానంద స్వామీజీ

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఎన్ని అవాంతరాలు వచ్చినా భగవంతుడి స్మరణను మరిచిపోరాదని, దయాస్వరూపుడైన ఆ దేవుడి తత్వం గొప్పదని దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానందస్వామి అన్నారు. జిల్లా కేంద్రంలోని గంగస్థాన్ ఫేస్-2 ఉత్తర తిరుపతి క్షేత్రంలో శనివారం గణపతి హోమం, అభిషేకం, లలితాసహస్రనామం, భగవద్గీత పారాయణం చేశారు. భక్తులనుద్దేశించి స్వామీజీ ప్రసంగించారు. క్షేత్రం అభ్యున్నతికి అందరూ కృషిచేయాలన్నారు. కార్యక్రమానికి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ట్రస్టీ సంపత్, వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చారు.

'సీఎం రాజీనామా చేయాలి'

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడలేని సీఎం రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనపై శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. విగ్రహం ధ్వంసం చేసిన నిందితులు, రెచ్చగొట్టిన వారిని శిక్షించకుండా శాంతియుతంగా ర్యాలీ చేస్తున్న హిందువులపై లాఠీఛార్జి చేయడాన్ని భాజపా తీవ్రంగా ఖండిస్తుందని చెప్పారు.

దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: దేవాలయాలపై జరుగుతున్న దాడులను కట్టడి చేయాలని, మతోన్మాదులను అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ హిందూ సంస్థల ప్రతినిధులు దిష్టిబొమ్మ దహనం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ తదితర సంస్థల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆర్డీవో రాజేంద్రకుమార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో పరిషత్ అధ్యక్షుడు దినేశ్ ఠాకూర్, విభాగ్ ప్రముఖ్ తుమ్మల కృష్ణ, కార్యదర్శి దయానంద్, ధాత్రిక రమేశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దాడులు అరికట్టాలని వినతి

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే: దేవాలయాలపై జరుగుతున్న దాడులు అరికట్టాలంటూ విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ప్రతినిధులు శనివారం బోధన్‌లో ర్యాలీ నిర్వహించారు. దాడులకు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, శివ, కోటేశ్వర్‌రావు, అర్జున్‌రాండర్, సురేష్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బోధన్ సబ్‌కలెక్టర్‌కు పత్రం అందిస్తున్న వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ప్రతినిధులు

సాలూర, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలని శాంతియుతంగా నిరసన చేపట్టిన హిందువులపై పోలీసులు లాఠీచార్జి చేయడం అమానుషమని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ పేర్కొన్నారు. హిందూ ఆలయాలపై దాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

పగిలిన పైపులు.. ప్రజల ఇబ్బందులు

నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానాలోని డ్రైనేజీ పైపులు పగిలిపోయి.. మురుగు బయటకు చిమ్ముతోంది. దీంతో ఆసుపత్రికి వివిధ పనులపై వచ్చే వారిపై మురుగు నీరు పడటంతో వారు ఇబ్బందులకు గురవుతున్నారు. దవాఖానా పైఅంతస్తుల నుంచి వచ్చిన మురుగు పైపుల ద్వారా కిందికి వస్తోంది. ఈ పైపులు పగిలిపోయి.. నీరంతా లీకేజీ అవుతుంది. ఆసుపత్రి ప్రధాన గేటు నుంచి టీ హబ్, నర్సింగ్ కళాశాలకు వెళ్లే దారిలో మురుగు నీరు చిమ్ముతోంది. అధికారులు స్పందించి పైపులు మరమ్మతులు చేయాలని దవాఖానాకు వచ్చే వారు కోరుతున్నారు.



ఈనాడు – నిజామాబాద్

సాక్ష్యం నమోదుపై పీపీలకు అవగాహన



సమావేశంలో పాల్గొన్న పీపీలు

నిజామాబాద్ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: నూతన భారతీయ చట్టాల ద్వారా కోర్టులో సాక్షులతో ఎలా సాక్ష్యం నమోదు చేయాలనే విషయంపై డీడీవోపీ లక్ష్మీనర్సయ్య పీపీలకు అవగాహన కల్పించారు. జిల్లా డీడీవోపీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎన్‌డీపీఎస్, పోక్సో కేసులలో సాక్ష్యం ఎలా నమోదు చేయాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇటీవల జిల్లా కోర్టు పీపీగా నియమితులైన రాజేశ్వర్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా కోర్టు పీపీలు రాజారెడ్డి, బంటు వసంత్, శ్యాంరావు, దామోదర్‌రెడ్డి, ఖాందేశ్ శ్రీనివాస్, రఫీమొద్దీన్, రాజేశ్‌గౌడ్, చిదిరాల రాణి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు మా దృష్టికి తీసుకురావాలి

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: పోలీసు సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ శింగెనవార్ అన్నారు. నగరంలోని పోలీసు పరేడ్ మైదానంలో శనివారం సిబ్బంది సందేహాలను ఆయన నివృత్తి చేశారు. సిబ్బంది బాగోగులను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారం త్వరితగతిన పూర్తి కావాలని ఉత్తర్వులు జారీచేశారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు కోటేశ్వర్‌రావు, బస్వారెడ్డి, ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

కుళ్లిన మృతదేహం లభ్యం

ఎడపల్లి, న్యూస్‌టుడే: ఎడపల్లి శివారులోని పెద్ద వాగు వద్ద కుళ్లిన మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వాగు వద్ద మృతదేహాన్ని గమనించిన స్థానికులు శనివారం పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకొన్న వారు శవాన్ని పరిశీలించారు. విషయం తెలుసుకొన్న బోధన్ ఏసీపీ శ్రీనివాస్, రూరల్ సీఐ విజయ్ బాబు అక్కడికి చేరుకొని విచారణ చేపట్టారు. ఠాణాలో అదృశ్యం కేసులు పరిశీలించిన అధికారులు మృతదేహం మండలానికి చెందిన వ్యక్తులది కాదని నిర్ధారణకు వచ్చారు. నెల కిందట మృతి చెంది ఉండటంతో మృతదేహం పూర్తిగా కుళ్లిపోయింది. శవం పురుషుడిదా, మహిళదా అనేది పోలీసులు తేల్చలేకపోయారు. క్లూస్ టీం సిబ్బంది వచ్చి వివరాలు సేకరించారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సోమవారం పోస్టుమార్టం నిర్వహించి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించనున్నారు. ఎడపల్లి పంచాయతీ కార్యదర్శి నాగరాజు ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

జానకంపేట చెరువులో..

ఎడపల్లి, న్యూస్‌టుడే: జానకంపేట చెరువులో శుక్రవారం గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. గ్రామానికి చెందిన మహేష్ అనే వ్యక్తి చెరువులో తేలిన వృద్ధురాలి మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకొన్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీయించి నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానాకు తరలించారు.

ఎలుగుబంటి సంచారం



ఎడపల్లి, న్యూస్‌టుడే : ఠాణాకలాన్ శివారులో ఎలుగుబంటి సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. తొలుత అలీసాగర్ ఫిల్టర్‌బెడ్ సిబ్బందికి శుక్రవారం రాత్రి ఎలుగుబంటి కనిపించింది. విద్యుత్తుశాఖ సిబ్బందికి సైతం అదే రోజు రాత్రి కనిపించడంతో వారు చరవాణిలో ఫొటో తీశారు. శనివారం ఈ విషయాన్ని వారు గ్రామస్థులకు తెలిపారు. అటవీశాఖ అధికారులకు సైతం సమాచారం ఇచ్చారు.

మహిళ అదృశ్యంపై కేసు

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే: బోధన్ పట్టణానికి చెందిన ఓ మహిళ (48) కుటుంబ కలహాల కారణంగా ఈ నెల 17న ఇంట్లో నుంచి వెళ్లిపోవడంతో బాధిత కుటుంబీకులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటనారాయణ తెలిపారు.

బాలిక..

ఎడపల్లి, న్యూస్‌టుడే: ఏఆర్పీక్యాంపు గ్రామానికి చెందిన బాలిక (15) శనివారం అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. సదరు విద్యార్థిని ఓ ప్రైవేటు కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతోంది. కళాశాలకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ ప్రారంభించారు.

ఎమ్మెల్సీకి సన్మానం



నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాకు వచ్చిన ఎమ్మెల్సీ కోదండరాంను ఉద్యోగ ఐకాస నాయకులు శనివారం కలిశారు. అధ్యక్షుడు అలుక కిషన్ నేతృత్వంలో ఆయనను సన్మానించారు. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ సమస్యలను వారితో చర్చించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు. ఇందులో టీజీవో జిల్లా కార్యదర్శి అమృత్‌కుమార్, టీఎన్జీవోస్ ప్రతినిధులు శేఖర్, నారాయణరెడ్డి, శ్రీనివాస్ నాగరాజు, ఉమాకిరణ్ ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

సాలూర : హున్సా నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌లను శనివారం రెవెన్యూ సిబ్బంది పట్టుకున్నారు. అనంతరం తహసీల్ కార్యాలయానికి తరలించి రెండు ఇసుక ట్రాక్టర్లకు జరిమానా విధించినట్లు తహసీల్దార్ శశిభూషణ్ తెలిపారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

నిజామాబాద్ గ్రామీణం : పశువులకు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశువైద్యాధికారి డా.జగన్నాథచారి పేర్కొన్నారు. పాల్దాలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల సరళిని పర్యవేక్షించారు.

ఆర్థిక చేయూత

జక్రాన్‌పల్లి : పడకల్‌కు చెందిన కిషన్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. బాధిత కుటుంబానికి గ్రామంలోని యువకులు, ఉద్యోగులు, వ్యాపారులు, రూ.1.78లక్షల నగదును కిషన్ కుమార్తె పేరిట డిపాజిట్ చేశారు. పురుషోత్తం, నరేష్, సత్యం, కృష్ణ పాల్గొన్నారు.

సెల్‌టవర్ తొలగించాలని వినతి

బోధన్ గ్రామీణం: ఎడపల్లిలో నివాసాల మధ్య నిర్మించిన ఓ సెల్‌టవర్ తొలగించాలని ఆ కాలనీవాసులు శనివారం బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్‌మహతోకు వినతిపత్రం అందించారు. టవర్ కోసం ఏర్పాటు చేసిన 11కేవీ విద్యుత్తు తీగలు సైతం ఇళ్ల మీదుగా ప్రమాదకరంగా ఉన్నాయని వినతిలో పేర్కొన్నారు.

స్వచ్ఛమైన నీరు అందించాలి

వర్ని : గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాల్సిన బాధ్యత మంచినీటి సహాయకులపై ఉందని డీఈఈ మునినాయక్ చెప్పారు. వర్ని రైతువేదికలో వర్ని, రుద్రూర్, మోస్రా, చందూర్ మండలాలకు చెందిన మంచినీటి సహాయకులకు నాలుగురోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులను ఎంపీడీవో వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన శనివారం ప్రారంభించారు. సమావేశంలో ఏఈఈ సాత్విక, అజయ్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గోడప్రతుల ఆవిష్కరణ

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగే ఐఎఫ్‌టీయూ విలీన సభను జయప్రదం చేసేందుకు కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని రాష్ట్ర నాయకుడు మల్లేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం బోధన్ పట్టణం రాకాసిపేట్‌లోని పాత మున్సిపల్ కార్యాలయంలో కార్మికులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గోడప్రతులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మక్కయ్య, జ్ఞానేశ్వర్, శంకర్, సురేష్, గంగారాం రాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందల్‌వాయి చేరిన మహా పాదయాత్ర

ఇందల్‌వాయి : నిర్మల్ జిల్లాలోని అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ ఆధ్వర్యంలో సునీల్ గురుస్వామి సమక్షంలో బాసర నుంచి శబరిమలైకు చేపట్టిన మహా పాదయాత్ర శనివారం ఇందల్‌వాయికి చేరింది. ఈ నెల 17న ప్రారంభించిన యాత్ర నవంబర్ 30వరకు శబరికి చేరుకుంటుందని వివరించారు. సాయిబాబా ఆలయంలో రాత్రి విశ్రాంతి తీసుకుని ఆదివారం ఉదయం 5 గంటలకు బయలుదేరనున్నట్లు పేర్కొన్నారు. గురుస్వాములు బీరేష్, జ్ఞానేశ్వర్, సుధాకర్, రమేష్ ఉన్నారు.

చలో హైదరాబాద్ జయప్రదానికి పిలుపు

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: ఎస్సీ కుల సర్వే చేపట్టి వర్గీకరణ చేయాలనే ప్రధాన డిమాండ్‌తో చేపట్టనున్న నిరసన దీక్షను విజయవంతం చేయాలని ఎస్సీ ఉప కులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుచ్చన్న పేర్కొన్నారు. మేరకు శనివారం నగరంలో నిరసన దీక్ష కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ నెల 21న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ధర్నా, నిరసన దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోసంగి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్, లింగస్వామి, గంగాధర్, రాజన్న, రాజు పాల్గొన్నారు.



నిరసన దీక్ష కరపత్రాలు ఆవిష్కరిస్తున్న గోసంగి నాయకులు

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


తూకం వేస్తున్న సొసైటీ ఛైర్మన్ గంగాధర్

రెంజర్ల(ముప్కాల్), న్యూస్‌టుడే: రెంజర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్ కోమటిశెట్టి గంగాధర్ శనివారం ప్రారంభించారు. సన్న రకాల ధాన్యానికి మద్దతు ధర క్వింటాకు రూ.2300 ఉందని, దొడ్డు రకాలకు రూ.2320 చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. వైస్ ఛైర్మన్ ముస్కు సంతోష్‌రెడ్డి, డైరెక్టర్లు క్యాతం గంగారెడ్డి, బద్దం శ్రీనివాస్, బద్ది ప్రసాద్, సీఈవో గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

బడి పరిసరాలు శుభ్రంగా ఉంచాలి


సామగ్రి నిల్వ గదిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని కస్తూర్బా, మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలను శనివారం మున్సిపల్ కమిషనర్ రాజు సందర్శించారు. బడుల ఆవరణలు, వంటశాలలు, సామగ్రి నిల్వ గదులు పరిశీలించారు. ఎప్పటికప్పుడు శుభ్రత పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో ఆరోగ్యశిబిరాలు జరిపి పిల్లలకు వైద్య పరీక్షలు జరిపించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి ఉన్నారు.

చిన్నారుల చిత్రాలు.. రాష్ట్రస్థాయి పతకాలు

☛ చిత్రలేఖనంలో అమ్రాద్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ

– న్యూస్‌టుడే, మాక్లూర్ గ్రామీణం


సాధన చేస్తున్న బాలికలు

మనసులోని భావాలను మాటల్లో వ్యక్తీకరించడం సులువే. కానీ చిత్ర రూపంలో తీసుకురావడం అందరికీ సాధ్యం కాదు. చిత్రాలు గీయాలంటే ఎంతో శ్రద్ధ, సాధన అవసరం. కానీ మాక్లూర్ మండలం అమ్రాద్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కుంచెతో అలవోకగా కళాఖండాలు గీస్తున్నారు. వాటితో రాష్ట్రస్థాయి బహుమతులూ అందుకుంటున్నారు. విద్యతో పాటు చిత్రకళను సాధన చేస్తూ తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రముఖుల మన్ననలు పొందుతున్నారు.

ప్రతి గోడపై..

పాఠశాలలోని గోడలపై ఎటు చూసినా విద్యార్థులు వేసిన చిత్రాలే కనిపిస్తాయి. ప్రకృతికి సంబంధించినవి, నీటి పొదుపు, కాలుష్య రహిత, జాతీయ నాయకులు, పాఠ్యాంశాల్లోని చిత్రాలు ఇలాంటివి ఎన్నో గీస్తూ గోడలపై అతికిస్తున్నారు. బొమ్మలు గీయడమే కాదు.. వాటి ప్రత్యేకతలు వివరిస్తారు.

చిన్నప్పటి నుంచి సాధన చేస్తున్నా..


వర్షశ్రీ, ఏడో తరగతి

చిన్నప్పటి నుంచి చిత్రాలు గీయడం సాధన చేస్తున్నా. నిత్య జీవితంలో జరిగే వేడుకల దగ్గర నుంచి ప్రకృతి రమణీయతకు ప్రాధాన్యం ఇస్తా. అలాంటివి వందల చిత్రాలు గీసి జిల్లా, రాష్ట్రస్థాయి బహుమతులు అందుకున్నా.

ప్రత్యేక అంశాలు ఎంచుకుంటా..

– మధుప్రియ, 8వ తరగతి



పల్లె వాతావరణం, ప్రకృతి అందాలు.. జాతీయ నాయకులు ఇలా ఎన్నో చిత్రాలు గీశాను. ప్రత్యేక అంశాలు ఉన్నవి ఎంచుకుంటా. పాఠశాల నుంచి రాష్ట్రస్థాయి వరకు పతకాలు సాధించా. ఇటీవల జాతీయస్థాయికి ఎంపికయ్యా.

అమ్మానాన్న ప్రోత్సహిస్తున్నారు



నాకు చిత్రలేఖనంపై ఉన్న మక్కువను అమ్మానాన్నలు గుర్తించి ప్రోత్సహిస్తున్నారు. చిన్నప్పటి నుంచే సాధన చేస్తున్నా. రాష్ట్రస్థాయి బహుమతులు అందుకున్నా. చాలా సంతోషంగా ఉంది. మరిన్ని చిత్రాలు గీసి జాతీయస్థాయిలో రాణిస్తా.

– పరిమళ, 8వ తరగతి

ప్రకృతి పరిరక్షణకు పెద్దపీట

చిన్నారులు చిత్రాలు గీయడమే.. కాదు ప్రకృతి పరిరక్షణకు పాటుపడుతున్నారు. ఉపాధ్యాయుడు రమేశ్ సహకారంతో ఏటా వినాయకచవితికి మట్టి గణపతులు తయారుచేసి గ్రామంలో ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. వాటి వల్ల కలిగే ఉపయోగాలను ప్రజలకు వివరిస్తారు. ఈ ఏడాది 300 విగ్రహాలు తయారుచేసి పంచిపెట్టారు. అలాగే ఖాళీ సీసాలు, డబ్బాలకు రంగులు వేసి అలంకరణ వస్తువులుగా తీర్చిదిద్దుతారు.


మట్టిగణపతిని డీఈవో దుర్గాప్రసాద్‌కు అందిస్తున్న ఉపాధ్యాయుడు రమేశ్

చాలా సంతోషంగా ఉంది

ప్రతి విద్యార్థిలో ప్రతిభ దాగి ఉంటుంది. కొందరికి క్రీడల్లో ఉంటే.. మరి కొందరికి కళల్లో ఉంటుంది. తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే ఎన్నో విజయాలు సాధిస్తారు. నా విద్యార్థులు పతకాలు సాధించడం సంతోషంగా ఉంది.

– రమేష్, చిత్రలేఖన ఉపాధ్యాయుడు, అమ్రాద్

చెరువు పరిశీలించి.. సర్వేకు ఆదేశించి


వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ అంకిత్

భీమ్‌గల్, న్యూస్‌టుడే: భీమ్‌గల్ పట్టణంలోని మొగిలి చెరువును జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ శనివారం పరిశీలించారు. చెరువు కబ్జా విషయమై గతంలో మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చెరువును పరిశీలించి సర్వే చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ చెరువును పరిశీలించారు. వర్షపు నీటితో చెరువు నిండితే నీరు వెళ్లేందుకు ఆస్కారం లేకుండా నాలా కబ్జాకు గురైందని పూర్తిస్థాయిలో సర్వే చేసి నాలా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్ షబ్బీర్, ఎంపీడీవో సంతోష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, సిబ్బంది తదితరులున్నారు.

పీపీలకు అవగాహన

నిజామాబాద్ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: నూతన భారతీయ చట్టాల ద్వారా కోర్టుల్లో సాక్షులతో ఎలా సాక్ష్యం నమోదు చేయలనే విషయంపై డీడీవోపీ లక్ష్మీనర్సయ్య పీపీలకు అవగాహన కల్పించారు. ఎన్‌డీపీఎస్, పోక్సో కేసుల్లో సాక్ష్యం ఎలా నమోదు చేయాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇటీవల జిల్లా కోర్టు పీపీగా నియమితులైన రాజేశ్వర్ రెడ్డిని సన్మానించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

94939 26837
98666 11160

సమస్య: నందిపేట్ గ్రామంలోని బర్కత్‌పురలో మురుగుకాల్వలు సక్రమంగా శుభ్రం చేయడం లేదు. తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. **- అహ్మద్, నందిపేట్**

సమాధానం: సమస్యను పారిశుద్ధ్య కార్మికులు, గ్రామ పంచాయతీ సిబ్బందితో మురుగుకాల్వలు శుభ్రం చేయిస్తాం
- లక్ష్మీప్రసాద్, ఎంపీవో, నందిపేట్


ఆలూర్‌లో రోడ్డు పక్కన పేరుకున్న వ్యర్థాలు

సమస్య: ఆలూర్ గ్రామంలో చెత్తకుండీలు ఏర్పాటు చేయలేదు. చెత్తను రోడ్ల పక్కన పోయడంతో కుప్పలుగా పేరుకుపోయాయి. **- తిర్మన్‌పల్లి సంపత్, ఆలూర్**

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి చెత్త తరలిస్తాం. **- రాజలింగం, పంచాయతీ కార్యదర్శి, ఆలూర్**

సమస్య: ఆలూర్ గ్రామంలో కుక్కల బెడత తీవ్రంగా ఉంది. ఇటీవల చిన్న పిల్లలు, వృద్ధులను 10 మందిని కుక్కలు గాయపర్చాయి. కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలి. **- తిర్మన్‌పల్లి సంపత్, ఆలూర్**

సమాధానం: కుక్కలకు కుటుంబ నియంత్రణ జరిపించాలని పశువైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లాను. త్వరలోనే సమస్య పరిష్కారం చేస్తాం. **- రాజలింగం, పంచాయతీ కార్యదర్శి, ఆలూర్**

సమస్య: ఆలూర్ గ్రామంలో వెల్మల్ రోడ్డుపై అధిక ఎత్తుతో స్పీడ్ బ్రేకర్లు నిర్మించారు. వాహనచోదకులు ప్రమాదాలకు గురై కింద పడి గాయాలపాలవుతున్నారు.
- తిర్మన్‌పల్లి సంపత్, ఆలూర్

సమాధానం: ఆర్‌అండ్‌బీ శాఖ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరిస్తాం.
- రాజలింగం, పంచాయతీ కార్యదర్శి, ఆలూర్

– న్యూస్‌టుడే, నందిపేట్, ఆర్మూర్ గ్రామీణం

ఏటీసీలతో ఉపాధి అవకాశాలు


భీమ్‌గల్, న్యూస్‌టుడే: భీమ్‌గల్ పట్టణంలోని ఐటీఐ ఆవరణలో నిర్మించనున్న అధునాతన సాంకేతిక శిక్షణ కేంద్రంతో ఉపాధి అవకాశాలుంటాయని ఆర్డీవో రాజాగౌడ్ అన్నారు. భీమ్‌గల్‌లోని ఐటీఐ కళాశాలలో ఏటీసీ నిర్మాణ స్థలాన్ని శనివారం పరిశీలించారు. ఎవరైనా అడ్డుకుంటే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ షబ్బీర్, ఐటీఐ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ జి.శ్రీనివాస్, నిషాంత్, రత్తు, తిరుపతి తదితరులున్నారు.

చర్యలు తీసుకోవాలని వినతి


ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆర్మూర్ గ్రామీణం: కొన్ని రోజులుగా రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల్లోని హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులపై విశ్వహిందూ పరిషత్తు, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయం ఎదుట శనివారం నిరసన తెలిపారు. దాడులకు పాల్పడిన వారిని ప్రభుత్వం శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో రాజాగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు.

అన్నంలో పురుగులు..
ఆందోళనలో తల్లిదండ్రులు


విద్యార్థులకు పెట్టిన భోజనంలో కనిపించాయిలా..

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ జడ్పీ బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో పురుగులు వచ్చాయి. శనివారం బడిలో జరిగిన పేరెంట్స్ మీటింగ్ అనంతరం విద్యార్థినుల తల్లిదండ్రులు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అన్నంలో పురుగులు కనిపించడంతో ఆందోళన చెందారు. ఏజెన్సీ నిర్వాహకురాలిని ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చిందని వాపోయారు. అన్నం ప్లేటు పట్టుకొని పలువురు తల్లిదండ్రులు ఆర్మూర్ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గతంలోనే ఇలాంటి ఘటనలు జరిగాయని వాపోయారు. మెనూ ప్రకారం, నాణ్యమైన భోజనాన్ని అందించడం లేదని ఆరోపించారు. విద్యాశాఖాధికారులకు సమస్యను తెలిసి, చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు సమాచారం.

ప్రతిభ చాటి.. బహుమతులు పొంది


బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ రవికాంత్, ఉపాధ్యాయులు


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని బ్రిలియంట్ పాఠశాలలో శనివారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు "ఇంటర్నెట్ వినియోగం.. లాభనష్టాలు" అనే అంశంపై వ్యాసరచన పోటీలు చేపట్టారు. విద్యార్థుల్లో ప్రతిభా పాటవాలను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని ప్రిన్సిపల్ రవికాంత్ పేర్కొన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులు శైనిక, సుశాంత్, హిందులకు ఆయన ఉపాధ్యాయులతో కలిసి బహుమతులు అందజేశారు.

బాధ్యతల స్వీకరణ


విద్యుత్తు ఏఈ శ్రీనివాస్

ముప్కాల్, న్యూస్‌టుడే: ముప్కాల్ మండల విద్యుత్తు ఏఈగా శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ పని చేసిన ఏఈ బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో శ్రీనివాస్ వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

రాత పుస్తకాల వితరణ

బస్సాపూర్(బాల్కొండ), న్యూస్‌టుడే: బస్సాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నిజామాబాద్‌కు చెందిన శ్రీరామ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రాత పుస్తకాలు, పెన్నులను వితరణగా శనివారం అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు రాజారాం, ఉపాధ్యాయులు నర్సయ్య, రమాదేవి, తిరుపతి, సంస్థ అధ్యక్షుడు తంగళ్లపల్లి శ్రీనివాస్, సభ్యులు రామ్మోహన్, సంతోష్‌కుమార్, టీఎస్ వాస్, నగేశ్, బాలశేఖర్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

'రైతులను మోసగించిన కాంగ్రెస్'


నందిపేట్‌లో నినాదాలు చేస్తున్న భారాస నాయకులు

నందిపేట్, న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో రుణమాఫీ చేస్తామని.. రైతు భరోసా ఇస్తామని నమ్మబలికిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నెరవేర్చకుండా మోసం చేస్తోందని భారాస నాయకులు మండిపడ్డారు. పార్టీ మండల అధ్యక్షుడు మచ్చర్ల సాగర్ ఆధ్వర్యంలో శనివారం నందిపేట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. మాట తప్పిన కాంగ్రెస్‌కు రానున్న ప్రజాక్షేత్రంలో పరాభవం తప్పదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సయ్యద్, బాబురాజ్, మనోజ్, ప్రభాకర్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: రైతుభరోసా పథకాన్ని యాసంగి సీజన్‌కు ఇవ్వడం లేదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేసిన ప్రకటనను నిరసిస్తూ భారాస నాయకులు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను మండల కేంద్రంలో దహనం చేశారు. భారాస మండల ప్రధాన కార్యదర్శి బద్దం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఉపేందర్‌రెడ్డి, నర్సయ్య, జైనొద్దీన్, ప్రభాకర్, నరేష్, చిన్నయ్య, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: రైతు బంధు ఇవ్వడం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను శనివారం ఆర్మూర్ అంబేడ్కర్ చౌరస్తాలో దహనం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజేశ్వర్‌రెడ్డి, పట్టణ శాఖ అధ్యక్షుడు పూజ నరేందర్, సీనియర్ నాయకులు శ్రావణ్, పృథ్వీరాజ్, క్రాంతి, రోహిత్, విజయ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మోర్తాడ్‌లో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. భారాస మండలాధ్యక్షుడు ఏలియ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లిలో భారాస ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. మంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో రాజేశ్వర్, సుధాకర్, నర్సారెడ్డి, రఘు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్: వేల్పూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. జైడి నాగధర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ, ముప్కాల్, న్యూస్‌టుడే: బాల్కొండ, ముప్కాల్‌లో భారాస ఆధ్వర్యంలో శనివారం ఆందోళన నిర్వహించారు. బాల్కొండ మండల అధ్యక్షుడు సాగర్‌యాదవ్, నాయకులు శ్రీకాంత్‌యాదవ్, భూస నరహరి, నాగభూషణం, నారాయణ, మురళి, ముప్కాల్‌లో మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్, బద్దం నర్సారెడ్డి, టి.రాజన్న, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్, న్యూస్‌టుడే: భీమ్‌గల్‌లోని సుమంగళీ చౌరస్తాలో భారాస మండలాధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నాయకులు శర్మనాయక్, నర్సయ్య, తుక్కాజీనాయక్, రాజేష్, రాములు, నర్సయ్య, లింగం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్మూర్ అంబేడ్కర్ చౌరస్తాలో..


మోర్తాడ్‌లో..


భీమ్‌గల్‌లో..


ఏర్గట్లలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నేతలు


కమ్మర్‌పల్లిలో..


వేల్పూర్‌లో..


బాల్కొండలో..


ముప్కాల్‌లో..

గోడప్రతుల ఆవిష్కరణ

ముప్కాల్, న్యూస్‌టుడే: ఐఎఫ్‌టీయూ విలీన సభ గోడప్రతులను ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ముత్తెన్న ముప్కాల్‌లో ప్రభుదాస్, కృష్ణదాస్ బీడీ కంపెనీలో శనివారం ఆవిష్కరించారు. టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీనం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ నెల 20న హైదరాబాద్‌లో సభ ఉంటుందని.. అధిక సంఖ్యలో కార్మికులు తరలిరావాలని కోరారు. జిల్లా నాయకులు ఎండీ నజీర్, మనోజ్, శ్రీనివాస్, రాజు, రమ్య, హేమలత, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.



సామగ్రి వచ్చే.. విద్యార్థి మురిసే

వేల్పూర్, న్యూస్‌టుడే: రామన్నపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల కంప్యూటర్ గదికి అదే గ్రామానికి చెందిన జెట్టి మల్లేష్ రూ.50 వేల విలువ చేసే సామగ్రి శనివారం వితరణ చేశారు. కంప్యూటర్ గదికి విద్యుత్తు సౌకర్యం, 10 కంప్యూటర్లకు ఫర్నీచర్, 15 కంప్యూటర్‌లకు కుర్చీలు, ఎలక్ట్రానిక్ బెల్‌ను అందజేశారు. ఎంఈవో రేణుక గదిని ప్రారంభించారు. పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందించడం అభినందనీయమన్నారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రాజన్న, ప్రధానోపాధ్యాయుడు శివాజీ, సునీత, నరేందర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.


కంపూటర్లలో సాధన చేస్తున్న విద్యార్థులు

సందడిగా రాజరాజేశ్వరస్వామి జాతర


నూత్‌పల్లిలో వెలసిన దుకాణాలు

నందిపేట్, న్యూస్‌టుడే: మండలంలోని నూత్‌పల్లిలో రాజరాజేశ్వర స్వామి జాతర కొనసాగుతోంది. శుక్రవారం రాత్రి స్వామి వారి రథయాత్ర నిర్వహించారు. శనివారం స్వామివారికి నైవేద్యాలు, సత్యనారాయణ వ్రతాలు చేశారు. ఆదివారం స్వామివారికి నాగవల్లి, పల్లకీసేవ నిర్వహిస్తామని గ్రామస్థులు తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలు విజయవంతం చేయాలని కోరారు.

భక్తులకు అన్నదానం

ఆర్మూర్ పట్టణం: ఆర్మూర్ పట్టణంలోని జంబిహనుమాన్ దేవస్థానంలో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో రవీందర్, ఉత్సవ కమిటీ ఛైర్మన్ సత్యనారాయణ మాట్లాడారు. దాతల సహకారంతో అన్నప్రసాదాన్ని భక్తులకు అందజేశారు.

యువజన విభాగం అధ్యక్షుడిగా బాలు


ఎంపీ ఈటల రాజేందర్‌ను సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ముదిరాజ్ మహాసభ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఆర్మూర్ పట్టణానికి చెందిన మందుల బాలు ఎన్నికయ్యారు. శనివారం నిజామాబాద్‌లో ఎంపీ ఈటల రాజేందర్ చేతులమీదుగా ఆయన నియామకపత్రాన్ని అందుకున్నారు. నర్సింగ్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

అవీ...ఇవీ.. అన్నీ

గుర్తింపు కార్డుల పంపిణీ

వేల్పూర్: కుకునూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం ప్రధానోపాధ్యాయుడు హరిచరణ్ గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన మిర్యాల కోమల్ రూ.5 వేల వితరణ చేయడంతో ఐడీ కార్డులు అందించామన్నారు. కార్యక్రమంలో వనిత, గ్రామకమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆసుపత్రిని సందర్శించిన వీడీసీ సభ్యులు

బాల్కొండ, న్యూస్‌టుడే: బాల్కొండ ప్రభుత్వ ఆసుపత్రిని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, వివిధ కుల సంఘాల పెద్దలు శనివారం సందర్శించారు. వైద్యులను కలిసి మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కోతుల బెడద తీవ్రంగా ఉందని, విద్యుత్తు తీగలు, నీటి సరఫరా పైపులను ధ్వంసం చేస్తున్నాయని వైద్యులు తెలిపారు. వైద్యుల కొరత సైతం ఉందన్నారు. ఆసుపత్రి సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తామని ప్రతినిధులు తెలిపారు.

హామీల అమలుకు పోరాటం

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ హామీల అమలుకు పోరాడుతామని సీపీఎం ఆర్మూర్ ఏరియా కార్యదర్శి వెంకటేశ్ పేర్కొన్నారు. ఏరియా కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా శనివారం శాస్త్రీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఎల్లయ్య, భూమన్న, సుజాత, కుల్దీప్ శర్మ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కార్యదర్శి వెంకటేశ్

పల్లకీ సేవ

జక్రాన్‌పల్లి, న్యూస్‌టుడే: తొర్లికొండలోని శిలాతీర్థా వేంకటేశ్వర మందిరంలో శనివారం పల్లకీ సేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు మంగళ హారతులతో పూజించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ సాయిరెడ్డి, కోశాధికారి చిన్న సాయన్న తదితరులు ఉన్నారు.